


## నిప్పుల కొలిమి

05

- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఎండలు
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరికలు
- ఉమ్మడి జిల్లావాసులకు ఆరెంజ్ అలెర్ట్

## ఏసీబీ వలలో తహసీల్దార్

- గజ్వేల్ తాహసీల్‌లో మెరుపు దాడులు
- లెక్కకు మించి ఆదాయం కలిగి ఉన్నాడనే ఆరోపణలు
- కీలకమైన పత్రాలు స్వాధీనం

05



సంపుటి :03 | సంచిక :30 | పేజీలు :06 | www.aksharadarbar.com

# అక్షర దర్బార్

Voice of the People

వెల ₹5

శనివారం 07, మార్చి 2026



## మహిళా సాధికారతతోనే సమాజ వికాసం

- రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- 400 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ
- శివనగర్‌లో స్వయంగా చీపురు పట్టి పారిశుధ్య పనుల్లో పాల్గొన్న మంత్రి, మేయర్, కలెక్టర్

05



- రాష్ట్రానికి చెందిన చిట్టచివరి మావోయిస్టుల లొంగుబాటు
- వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు
- ఒక రీజినల్ కమిటీ సభ్యుడు.. 10 మంది డివిజనల్ కమిటీ సభ్యులు
- లొంగిపోయిన వారికి సీఎం భరోసా
- హెల్త్ కార్డుల జారీ, కేసుల ఎత్తివేత అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- రాజకీయాల్లోకి రావొచ్చని, కాంగ్రెస్ లో చేరినా ఒకే అని ప్రకటన
- పునరావాసం కల్పిస్తాం: డీజీపీ శివధర్ రెడ్డి
- హింసతో ఏం సాధించలేం: సీఎం రేవంత్ రెడ్డి

## మావోయిస్టుల సంఖ్య

# జీరో

## అర్ధ శతాబ్దపు ఉద్యమం.. హస్తగత సమాప్తం

తెలంగాణ గడ్డపై సుమారు 50 ఏళ్ల మావోయిస్టు ఉద్యమానికి శనివారం అధికారికంగా తెరపడింది. అజ్ఞాతంలో ఉన్న చిట్టచివరి తెలంగాణ కేడర్ మావోయిస్టులు భారీ సంఖ్యలో జనజీవన స్రవంతిలోకి రావడంతో రాష్ట్రంలో ఒక సుదీర్ఘ పోరాట శకం ముగిసినట్లయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో మొత్తం 130 మంది మావోయిస్టులు శనివారం సాయంత్రం తమ ఆయుధాలను వదిలి ప్రభుత్వానికి లొంగిపోయారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, 10 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులతో పాటు 70 మంది పార్టీ సభ్యులు తమ ఉనికిని చాటుకున్నారు. ముఖ్యంగా దేవ్‌జీ నేతృత్వంలోని పీఎల్జీఏ కమిటీ మొత్తం సరెండర్ కావడమే కాకుండా, 124 అత్యాధునిక ఆయుధాలను పోలీసులకు అప్పగించింది. లొంగిపోయిన వారిలో పీఎల్జీఏ బెటాలియన్ కంపెనీ కమాండర్ కొరసా లక్కు, ఉకి కల్లు, చలసాని నవత, అరుణ, సుధాకర్ వంటి కీలక నేతలు ఉండటం గమనార్హం. దాదాపు ఐదు దశాబ్దాలుగా అడవి బాట పట్టిన కీలక కేడర్ అంతా ఒక్కసారిగా బయటకు రావడంతో తెలంగాణలో మావోయిస్టుల అధ్యాయం ముగిసిందని అధికార వర్గాలు ప్రకటించాయి.

02

– అక్షరదర్బార్, హైదరాబాద్



# మావోయిస్టుల సంఖ్య 'జీరో'

- అర్ధ శతాబ్దపు ఉద్యమం.. హస్తగత సమాప్తం
- రాష్ట్రానికి చెందిన చిట్టచివరి మావోయిస్టుల లొంగుబాటు
- వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు
- ఒక రీజినల్ కమిటీ సభ్యుడు.. 10 మంది డివిజనల్ కమిటీ సభ్యులు
- లొంగిపోయిన వారికి సీఎం భరోసా
- హెల్త్ కార్డుల జారీ, కేసుల ఎత్తివేత అంశాన్ని పరిశీలిస్తామని హామీ
- రాజకీయాల్లోకి రావొచ్చని, కాంగ్రెస్ లో చేరినా ఒకే అని ప్రకటన
- పునరావాసం కల్పిస్తాం: డీజీపీ
- హింసతో ఏం సాధించలేం: సీఎం




అక్షరదర్బార్, హైదరాబాద్
తెలంగాణ గడ్డపై సుమారు 50 ఏళ్ల మావోయిస్టు ఉద్యమానికి శనివారం అధికారికంగా తెరపడింది. అజ్ఞాతంలో ఉన్న చిట్టచివరి తెలంగాణ కేడర్ మావోయిస్టులు భారీ సంఖ్యలో జనజీవన స్రవంతిలోకి రావడంతో రాష్ట్రంలో ఒక సుదీర్ఘ పోరాట శకం ముగిసినట్లయింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో మొత్తం 130 మంది మావోయిస్టులు శనివారం సాయంత్రం తమ ఆయుధాలను వదిలి ప్రభుత్వానికి లొంగిపోయారు. బంజారా హిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, 10 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులతో పాటు 70 మంది పార్టీ సభ్యులు తమ ఉనికిని చాటుకున్నారు. ముఖ్యంగా దేవ్‌జీ నేతృత్వంలోని పీఎల్జీఏ కమిటీ మొత్తం సరెండర్ కావడమే కాకుండా, 124 అత్యాధునిక ఆయుధాలను పోలీసులకు అప్పగించింది. లొంగిపోయిన వారిలో పీఎల్జీఏ బెటాలియన్ కంపెనీ కమాండర్ కొరసా లక్కు, ఉకి కల్లు, చలసాని నవత, అరుణ, సుధాకర్ వంటి కీలక నేతలు ఉండటం గమనార్హం. దాదాపు ఐదు దశాబ్దాలుగా అడవి బాట పట్టిన కీలక కేడర్ అంతా ఒక్కసారిగా బయటకు రావడంతో తెలంగాణలో మావోయిస్టుల అధ్యాయం ముగిసిందని అధికార వర్గాలు ప్రకటించాయి.

### - శాంతియుత వాతావరణమే లక్ష్యం: డీజీపీ శివధర్ రెడ్డి

రాష్ట్రంలో మావోయిస్టు కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపేందుకు పోలీసులు గత కొంతకాలంగా చేసిన నిరంతర కృషి నేడు ఫలించిందని డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. హింస ద్వారా ఏ సమస్య పరిష్కారం కాదని, శాంతియుత వాతావరణంలోనే అభివృద్ధి సాధ్యమని మావోయిస్టులకు వివరించి వారిలో నమ్మకాన్ని కలిగించడంలో పోలీసు యంత్రాంగం విజయవంతమైందని వివరించారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టు నేతలతో సమన్వయం చేసుకుంటూ వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడానికి క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. అడవుల్లో అనారోగ్యంతో, సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం కల్పిస్తున్న పునరావాస ప్యాకేజీల గురించి అవగాహన కల్పించామని వివరించారు. ఇప్పటివరకు వివిధ సందర్భాల్లో 721 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వారందరి నుంచి మొత్తం 250 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. లొంగిపోయిన ప్రతి ఒక్కరికీ చట్టప్రకారం అందాల్సిన నగదు బహుమతులు, పునరావాస ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో హింసకు తావు లేకుండా శాంతిభద్రతల పరిరక్షణకు తమ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేశారు. అజ్ఞాతంలో ఉన్న మిగిలిన వారు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ముఖ్యమంత్రి పిలుపు మేరకు సమాజంలో గౌరవంగా బతకాలని కోరారు.

### - హింసతో ఏం సాధించలేం: సీఎం

హింసాత్మక చర్యల ద్వారా ఏమీ సాధించలేరని, అహింసా మార్గంలోనే సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తుపాకీ గొట్టం ద్వారా కాకుండా చర్చల ద్వారానే మార్పు సాధ్యమని గాంధీజీ నిరూపించారని గుర్తుచేశారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తుందని హామీ ఇచ్చారు. అజ్ఞాతంలో ఉన్నవారు కూడా ప్రజలతో మమేకమై వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. లొంగిపోయిన వారికి మెరుగైన పరిహారం అందజేయడమే కాకుండా, స్వగ్రామాల్లో ఇల్లు కట్టుకునే వారికి ప్రభుత్వం సాయం చేస్తుందని ప్రకటించారు. వారికి ప్రత్యేక ఆరోగ్య భద్రత కార్డులు జారీ చేస్తామని వెల్లడించారు. మావోయిస్టులపై ఉన్న కేసుల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. చట్టపరంగా ఎత్తివేయడానికి అవకాశం ఉన్న కేసులను పరిశీలిస్తామని, నేరాల తీవ్రతను బట్టి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. లొంగిపోయిన వారు రాజకీయాల్లోకి రావాలనుకుంటే స్వాగతిస్తామని పేర్కొన్నారు. మంత్రి సీతక్క వంటి వారు ఇప్పటికే ప్రజాప్రతినిధులుగా రాణిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకునే వారు పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి తమ ఆసక్తిని తెలపవచ్చని సూచించారు.

### గణపతి కూడా లొంగిపోవాలి

**మావోయిస్టు పార్టీ సుప్రీం ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి కూడా వీలైనంత త్వరగా లొంగిపోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గణపతితో పాటు అజ్ఞాతంలో ఉన్న మిగిలిన ఏడుగురు అగ్రనేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. వారికి అవసరమైన పూర్తి భద్రతను తెలంగాణ ప్రభుత్వమే కల్పిస్తుందని భరోసా ఇచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో ఇంత పెద్ద ఎత్తున లొంగుబాటు జరగడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. మావోయిస్టు నేతలు రాజిరెడ్డి, దేవ్ జీలతో చర్చించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నామని, వారి డిమాండ్ల పరిష్కారం కోసం కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో కూడా మాట్లాడినట్లు వెల్లడించారు.**



## ములుగు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనుల కోసం ఇప్పటికే రూ.15 కోట్లతో టెండర్లు నిర్వహించినట్లు చెప్పారు. 5వ వార్డులో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు, రానున్న రోజుల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆసియా షాహిన్ రియాజ్ మీర్జా, 5వ వార్డు కౌన్సిలర్ గుగ్గిళ్ల దివ్య సుజన్ పాల్గొన్నారు.

## గుండెపోటుతో జయశ్రీ మృతి

### - హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ పాలకమండలి తీవ్ర దిగ్భ్రాంతి



అక్షరదర్బార్, హనుమకొండ: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా పాలక మండలి సభ్యురాలు చెన్నమనేని జయశ్రీ శనివారం సాయంత్రం గుండెపోటుతో అకస్మాత్తుగా కన్నుమూశారు. ఆమె మరణం పట్ల రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా పాలక మండలి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.
సమాజ సేవా కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొని రెడ్ క్రాస్ కార్యక్రమాల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. ఆమె సేవలను ఈ సందర్భంగా సభ్యులు స్మరించుకున్నారు. జయశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా పాలక మండలి, సిబ్బంది తెలియజేసింది.

## దిశ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎస్సార్

అక్షర దర్బార్, శాయంపేట: హన్మకొండ కలెక్టర్ కార్యాలయం (ఐడీఓసీ)లో ఎంపీ కడియం కావ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై అధికారులు వివరాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ శాయంపేట మండలంలోని గురుకుల, ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ సదుపాయం, కిచెన్ షెడ్లు, తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో దిశ వైస్ చైర్మన్ బండా ప్రకాష్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## బీమా చెక్కు అందజేత



అక్షర దర్బార్, ములుగు జిల్లా ప్రతినిధి: ములుగు జిల్లా గుర్రంపేటకు చెందిన బానోతు సారయ్య అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన తీసుకున్న శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీ ఆధారంగా సంస్థ నుంచి మంజూరైన రూ.6,01,800 బీమా చెక్కును శనివారం సర్పంచ్ కోడూరు రవి, ఉప సర్పంచ్ దామరొప్పుల సుధాకర్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరామ్ సమస్త డీజీఎం గంగుల సతీష్, వరంగల్ డివిజనల్ మేనేజర్ బండి వినయ్, ములుగు బ్రాంచ్ మేనేజర్ కుమార్, డీవోలు రాజు, జయమ్మ, రజిత, మల్లికార్జున్, నారాయణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ వేడుకలు



అక్షర దర్బార్, శాయంపేట: శాయంపేట మండల కేంద్రంలోని సురేఖ మండల సమాఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని శనివారం ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య అధ్యక్షురాలు గడిపే సుమలత కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం వేణుగోపాలరావు, అధ్యక్షురాలు సుమలత సీసీ జిన్నా మంజుల, అకౌంటెంట్ గోలి అనిత, అటెండర్ పాపని మంజుల, సీసీలు విజయకుమార్, శ్రీనివాసరావు, మండల సమాఖ్య కోశాధికారి దాసరి కల్పనాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

# పంట మార్పిడితో అధిక ఆదాయం

**జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న**



అక్షర దర్బార్, మహబూబాబాద్ : రైతులు సంప్రదాయ పంటలకే పరిమితం కాకుండా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ మరియు ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన మరియు పట్టుపరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న పిలుపునిచ్చారు. శనివారం దంతాలపల్లి, నర్సింహులపేట, నెల్లికుదురు మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆయన, రైతులకు పంట మార్పిడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మరియన్న మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు మొక్కలు, తోటల నిర్వహణ, అంతర పంటలు మరియు బిందు సేద్యం కలిపి ఎకరాకు మొత్తం రూ. 50,918 రాయితీ ప్రభుత్వం అందిస్తోందని వివరించారు. అలాగే పండ్ల తోటల విస్తరణలో భాగంగా మామిడి, నిమ్మ, జామ సాగుకు రూ. 19,200 చొప్పున, డ్రాగన్ ఫ్రూట్ సాగుకు గరిష్టంగా రూ. 64,800 వరకు రాయితీలు లభిస్తాయని పేర్కొన్నారు. రైతులు కూరగాయలు, పూలు, మల్బరీ, పుట్టగొడుగుల పెంపకం వంటి లాభదాయకమైన ఉద్యాన పంటల వైపు మొగ్గు చూపాలని, తద్వారా ఎకరానికి లక్ష రూపాయల నికర ఆదాయం పొందవచ్చని ఆయన విజ్ఞప్తి చేశారు. సాగులో మల్చింగ్, బిందు సేద్యం వంటి ఆధునిక పద్ధతులతో పాటు ప్రకృతి సిద్ధమైన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పట్టు పరిశ్రమను ప్రోత్సహించేందుకు రెండు ఎకరాల్లో మల్బరీ సాగుతో పాటు షెడ్ నిర్మాణానికి రూ. 5 లక్షల భారీ రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. శాశ్వత పందిర్ల నిర్మాణానికి కూడా అర ఎకరాకు రూ. 50 వేల ఆర్థిక సాయం అందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజుల కొత్తపల్లి సర్పంచ్ జనార్ధన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి యాకూబ్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ అధికారులు రాజ్ కుమార్, నర్మద, రైతులు పాల్గొన్నారు.

# ఎస్‌హెచ్‌జీల ద్వారా ఎరువుల విక్రయ కేంద్రాలు

- ప్రతి క్లస్టర్ లో ఒక కేంద్రం ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



అక్షర దర్బార్, జనగామ: జిల్లాలో రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో, సులభంగా అందుబాటులో ఉండేలా ప్రతి క్లస్టర్‌లో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా ఎరువుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్‌హెచ్‌జీ సభ్యులు ఫర్టిలైజర్ షాప్ నిర్వహణ అంశంపై నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 62 క్లస్టర్లు ఉన్నాయని, ప్రతి క్లస్టర్‌లో ఒక ఎరువుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎరువులు, విత్తనాలు సమీపంలోనే అందుబాటులోకి రావడంతో పాటు సమయం, రవాణా ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు డీఆర్‌డీఏవోతో సమన్వయం చేసుకొని అవసరమైన లైసెన్సులు, శిక్షణలు త్వరితగతిన పూర్తి చేసి రాబోయే సాగు సీజన్‌కు ముందుగానే ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏవో, జిల్లా వ్యవసాయ అధికారి, సహాయ వ్యవసాయ సంచాలకులు, వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

# వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి జినుగు మరియన్న



అక్షర దర్బార్, మహబూబాబాద్ (నెల్లికుదురు) : విద్యార్థులు చదువులో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు మానసిక వికాసాన్ని పెంపొందించుకోవాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న సూచించారు. శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన తహసీల్దార్ చందా నరేష్, ఎంపీడీఓ ఎస్. కుమార్, వైద్యాధికారి డాక్టర్ చైతన్యలతో కలిసి నెల్లికుదురు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యా విధానం, వసతులు మరియు భోజన సౌకర్యాలను వారు నిశితంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మరియన్న మాట్లాడుతూ.. విద్యార్థులు పూర్తి ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలని, కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా క్రీడలు, వ్యాయామం ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. పాఠశాల సిబ్బంది విద్యార్థుల అభివృద్ధి కోసం నిర్విరామంగా కృషి చేయాలని, విద్యార్థులతో పాటు సిబ్బంది కూడా వ్యక్తిగత మరియు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులకు నిత్యం తాజా మరియు వేడి ఆహారాన్ని అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఒకవేళ ఏ విద్యార్థికైనా జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి అనారోగ్య లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీయ చికిత్సలు చేయరాదని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుమలతతో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఎర్రబెల్లి స్వర్ణకు వసంత శంకర్ శుభాకాంక్షలు

అక్షర దర్బార్, పరకాల: రాష్ట్ర మహిళా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలిగా ఎర్రబెల్లి స్వర్ణ నియమితులైన సందర్భంగా పరకాల కాంగ్రెస్ నాయకులు లక్కం వసంత శంకర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎర్రబెల్లి స్వర్ణ గతంలో వరంగల్ నగర మేయర్‌గా, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సమర్థవంతంగా పనిచేసి పార్టీకి సేవలు అందించారని పేర్కొన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఆమె నియామకం పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ రాష్ట్రవ్యాప్తంగా మహిళలను కాంగ్రెస్ పార్టీ వైపు ఆకర్షించడంలో కీలక పాత్ర పోషిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.



# 13న మానుకోటలో జాబ్ మేళా

అక్షర దర్బార్, మహబూబాబాద్: జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈ నెల 13న ప్రత్యేక ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్డీఓ) మధుసూదన రాజు తెలిపారు. జహీరాబాద్‌లోని 'మహీంద్రా & మహీంద్రా' సంస్థలో అప్రెంటిస్, ఉద్యోగ ఖాళీల భర్తీకి ఈ మేళా జరుగుతుందన్నారు. 10వ తరగతి, ఇంటర్ లేదా ఐటీఐ ఉత్తీర్ణులై 18 నుండి 25 ఏళ్ల లోపు వయసున్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 12,000 నుండి రూ. 14,300 వరకు వేతనంతో పాటు ఉచిత రవాణా, భోజన వసతి కల్పిస్తారని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 13న ఉదయం 10:30 గంటలకు జిల్లా రైల్వే స్టేషన్ పక్కన గల జిల్లా సమాఖ్య కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 8522054266 నంబర్‌ను సంప్రదించవచ్చు.



# పరకాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలి

అక్షర దర్బార్, పరకాల: హనుమకొండ జిల్లా పరకాల డివిజన్‌లో కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పరకాల పట్టణంలోని అమరధామంలో తెలంగాణ రైతు సంఘం, రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం ప్రెస్ నోట్ విడుదల చేశారు.పరకాల డివిజన్ పరిధిలోని శాయంపేట, రేగొండ, మొగుళ్లపల్లి, నడికూడ మండలాలకు చెందిన సుమారు 120 గ్రామాల రైతులు పంటల సమస్యల పరిష్కారం కోసం వరంగల్‌లోని ఆర్ఏఆర్ఎస్‌కు వెళ్లాల్సి వస్తోందన్నారు. పరకాలలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు తక్షణ సలహాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో వరికెల కిషన్‌రావు, ఊరటి అంజయ్యరెడ్డి, సోమిడి సాంబయ్య, గూడ సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఇబ్బందులను తొలగించిన కౌన్సిలర్ పూర్ణాచారి

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీలోని 9వ వార్డులో పాత సమత స్కూల్ సమీపంలోని సీసీ రోడ్డులో గుంతలు ఏర్పడి ఇనుప సలాకులు బయటకు రావడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి శనివారం తన స్వఖర్చుతో సీసీ పోయించి గుంతలను పూడ్చివేశారు. కాలనీ సంక్షేమం కోసం స్వఖర్చుతో పనులు చేపడుతున్న పూర్ణాచారిని కాలనీ వాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ నరేష్, దార్నా నారాయణ దాస్, వావిలాల రవీందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఓడినా గెలిచినా ప్రజా సేవే లక్ష్యం..

**-మాజీ కౌన్సిలర్ శనిగరం రజినీ నవీన్**

అక్షర దర్బార్, పరకాల: గెలుపు-ఓటములతో సంబంధం లేకుండా ప్రజా సేవే తమ లక్ష్యమని మాజీ కౌన్సిలర్ శనిగరం రజినీ నవీన్ తెలిపారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో పరకాల 17వ వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఒక్క ఓటుతో ఓడిపోయినప్పటికీ ప్రజలకు సేవ చేయడం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. గతంలో 13వ వార్డు కౌన్సిలర్‌గా పనిచేసిన తాము, ప్రజల కోరిక మేరకు 17వ వార్డులో పోటీ చేశామని తెలిపారు. ఓటమి వచ్చినా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇటీవల వార్డులో మరణించిన కుటుంబాలను పరామర్శిస్తూ సహాయం అందిస్తున్న ఆమెకు స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు.



## పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

అక్షర దర్బార్, మల్హర్: మల్హర్ మండలంలోని గ్రామ పంచాయతీల్లో 'ప్రజాపాలన-ప్రగతి' కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న పారిశుధ్య పనులను డివిజనల్ పంచాయతీ అధికారి (డీపీఓ) శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీధుల శుభ్రత, మురుగు కాలువల పూడికతీత పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా లేదా విధుల్లో అలసత్వం ప్రదర్శించినా సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. ఈ తనిఖీల్లో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన దంపతులకు చీర-సారె పంపిణీ

అక్షర దర్బార్, దుగ్గొండి: నూతన వధూవరులకు గ్రామ సర్పంచ్ చీర-సారె అందజేశారు. ఎన్నికల హామీలో భాగంగా మండలంలోని నాచినపల్లి గ్రామానికి చెందిన మేకల స్వరూప-భాస్కర్ దంపతుల కుమార్తె వనిల వివాహం సాయికుమార్‌తో శనివారం జరగగా, గ్రామ సర్పంచ్ పెండ్యాల రాజు-మమత దంపతులు నూతన దంపతులకు చీర-సారె కింద రూ.10,116 అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# పల్లెల్లో నిధుల పంచాయితీ

- తాజాగా జీపీలకు నిధుల విడుదల
- వినియోగంపై పాత, కొత్త సర్పంచ్ ల మధ్య లొల్లి..!
- తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలంటున్న పాత సర్పంచ్ లు
- కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కొత్త సర్పంచ్ ల ఆసక్తి
- మధ్యవర్తులుగా పంచాయతీల కార్యదర్శులు
- విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులపై గందరగోళం




అక్షరదర్బార్, పరకాల: పరకాల నియోజకవర్గంలోని పరకాల, నడికూడ మండలాల్లో పాత సర్పంచ్‌లు, కొత్త సర్పంచ్‌ల మధ్య పెండింగ్ బిల్లుల చెల్లింపులపై లొల్లి మొదలైంది. పంచాయతీ కార్యదర్శులు మధ్యవర్తులుగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో గతంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలంటూ పాత సర్పంచ్‌లు డిమాండ్ చేస్తుండగా, అదే నిధులతో కొత్తగా అభివృద్ధి పనులు ఎలా చేపట్టాలంటూ కొత్త సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామపంచాయతీల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. తెలంగాణలో దాదాపు రెండు సంవత్సరాల ఆలస్యంగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించడంతో గత జనవరి నెలలో కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టాయి. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో గ్రామాల్లో పాలన కొనసాగుతోంది. ఎన్నికలు ఆలస్యం కావడంతో గత రెండు సంవత్సరాల కాలంలో పంచాయతీ కార్యదర్శులు అత్యవసర పనులను తమ సొంత డబ్బులతో నిర్వహించినట్లు తెలుస్తోంది. దీంతో వారికి కూడా బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. ఇక కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు నిలిపివేసింది. ఎన్నికలు ముగిసిన తర్వాత గ్రామపంచాయతీలకు దశలవారీగా నిధులను విడుదల చేస్తోంది. ఇదే సమయంలో గ్రామాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులను కేటాయిస్తోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం పలు విడతల్లో సుమారు రూ.1,034 కోట్లను గ్రామపంచాయతీలకు విడుదల చేసింది.

### - వినియోగంపై వివాదం

అయితే ఈ నిధుల వినియోగంపైనే ఇప్పుడు కొత్త, పాత సర్పంచ్‌ల మధ్య తీవ్ర వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయి. తమ హయాంలో వైకుంఠధామాలు, డ్రైనేజీలు, క్రీడా ప్రాంగణాలు వంటి అభివృద్ధి పనులు చేపట్టామని పాత సర్పంచ్‌లు చెబుతున్నారు. అప్పట్లో బిల్లులు రాకపోవడంతో అప్పులు తెచ్చి పనులు చేయాల్సి వచ్చిందని, ప్రస్తుతం ఆ అప్పులపై వడ్డీలు పెరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కొత్త సర్పంచ్‌లు మాత్రం పెండింగ్ బిల్లులకే నిధులు వెచ్చిస్తే గ్రామాల్లో కొత్త అభివృద్ధి పనులు ఎలా చేపట్టాలంటూ ప్రశ్నిస్తున్నారు. కార్యదర్శులు కూడా తమ బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు. దీంతో పాత, కొత్త పాలకవర్గాలు, కార్యదర్శుల బకాయిలపై సమన్వయం చేసి ప్రభుత్వం పరిష్కారం చూపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### కొత్త సర్పంచులు సహకరించాలి


**- ఊర రవీందర్ రావు, మాజీ సర్పంచ్ నడికూడ**



నడికూడ మాజీ సర్పంచ్ ఊర రవీందర్ రావు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి కోసం లక్షలు అప్పులు తీసుకుని పనులు చేపట్టామని తెలిపారు. ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైన నేపథ్యంలో పాత బకాయిలను చెల్లించాలని కోరారు. పాత, కొత్త సర్పంచ్ లు గ్రామ అభివృద్ధి కోసమే కృషి చేస్తున్నారని, ఒకరికి ఒకరు సహకరించి బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### పంచాయతీ ఖర్చులపై విచారణ జరపాలి

**- సనత్ కుమార్, అలియాబాద్ సర్పంచ్**



రెండు సంవత్సరాల పాటు గ్రామపంచాయతీలో సర్పంచ్ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోందన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో అధికంగా ఖర్చు చేసినట్లు సమాచారం ఉందని, దీనిపై సంబంధిత అధికారులు పూర్తి వివరాలు సేకరించి విచారణ చేపట్టాలని కోరారు. అలాగే గ్రామ అభివృద్ధి కోసం పాత సర్పంచ్ లు చేసిన ఖర్చులను పరిశీలించి బకాయిలను చెల్లించేందుకు సహకరిస్తాం..

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించాలి

**-వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**



అక్షర దర్బార్, నల్లబెల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సూచించారు. శనివారం నల్లబెల్లి మండల కేంద్రంలో ఈ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య నిపుణులతో మెడికల్ క్యాంప్‌ను ప్రారంభించారు. ప్రజలు అనారోగ్య సమస్యలు రాకుండా ఉండేందుకు జీవనశైలిలో మార్పులు చేసుకుని పౌష్టికాహారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. సాంబశివరావు మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, టీబీ, డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులపై ఉచిత పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అలాగే మార్చి 8 నుంచి 14-15 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను నర్సంపేట, సికేఎం, ఎంజీఎం, వర్ధన్నపేట ఆసుపత్రుల్లో ప్రారంభిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రామ్‌రెడ్డి, ఆర్డీవో ఉమారాణి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ కృష్ణ, వైద్యులు, ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## శివాజీనగర్ లో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలి

**-సర్పంచ్ సుకినే నాగరాజు**

అక్షర దర్బార్, దుగ్గొండి: శివాజీనగర్ గ్రామంలో రేషన్ షాప్ ఏర్పాటు చేయాలని సర్పంచ్ సుకినే నాగరాజు కోరారు. శనివారం జీపీ పాలకవర్గంతో కలిసి దుగ్గొండి తహసీల్దార్ రాజేశ్వరరావుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో రేషన్ షాప్ లేక గ్రామస్తులు రేకంపల్లికి వెళ్లి రేషన్ తీసుకురావాల్సి వస్తోందని తెలిపారు. శివాజీనగర్‌లోనే రేషన్ షాప్ ఏర్పాటు చేస్తే గ్రామస్తులకు సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు.

# మహిళా సాధికారతతోనే సమాజ వికాసం

- మంత్రి కొండా సురేఖ
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు
- 400 మంది మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ
- శివనగర్ లో స్వయంగా చీపురు పట్టి పారిశుధ్య పనుల్లో పాల్గొన్న మంత్రి, మేయర్, కలెక్టర్



అక్షరదర్బార్, వరంగల్: మహిళలు కేవలం గృహిణులుగా మాత్రమే కాకుండా ఆర్థిక స్వయం సమృద్ధి సాధించి కుటుంబానికి వెన్నుముకగా నిలవాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని వరంగల్ తూర్పు నియోజకవర్గ పరిధిలోని శివనగర్ సాయి కన్వెన్షన్ హాల్‌లో జిల్లా మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో 'ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా శక్తి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 400 మంది లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా కుట్టు మిషన్లు మరియు రంజాన్ తోఫాలను అందజేశారు. సభను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ.. "సృష్టికి మూలం మహిళ. స్వాతంత్ర్య సంగ్రామం నుండి నేటి అభివృద్ధి వరకు మహిళల పాత్ర వెలకట్టలేనిది. వరంగల్ జిల్లాలో కలెక్టర్, మేయర్, మున్సిపల్ కమిషనర్ వంటి కీలక బాధ్యతల్లో మహిళలే ఉండి జిల్లాను ప్రగతి పథంలో నడిపించడం గర్వకారణం" అని పేర్కొన్నారు. నగర మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహాలక్ష్మి పథకం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్, వడ్డీ లేని రుణాలు, మహిళా క్యాంటీన్ల వంటి ఎన్నో పథకాలతో ప్రభుత్వం మహిళా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా పొదుపు చేస్తూ కుటుంబ ఆర్థిక భారాన్ని మోయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు.

### - శ్రమదానంలో పాల్గొన్న మంత్రి

అనంతరం 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా శివనగర్ రైల్వే ప్లాట్‌ఫాం పరిసరాల్లో మంత్రి, మేయర్, కలెక్టర్ స్వయంగా చీపుర్లు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. అక్కడ పేరుకుపోయిన సిల్ట్ (మట్టి)ను తొలగించి ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.




# విద్యా, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత

- ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు అవసరం
- వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య

అక్షర దర్బార్, హనుమకొండ: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య సూచించారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశాన్ని ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, నీటిపారుదల, జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ తదితర శాఖల అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. పాఠశాలల్లో డ్రాపౌట్స్ తగ్గించడంతో పాటు విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డా. బండా ప్రకాష్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, ప్రీ స్కూల్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య వేసవి కాలంలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ జిల్లాలో 400కు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని, ప్రవేశాలను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు ప్రభుత్వ పాఠశాలలకు సోలార్ సదుపాయం కల్పించాలని సూచించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శాయంపేట మండలం పెద్దకోడెపాక ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# నిప్పుల కొలిమి

- భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఎండలు
- ఉమ్మడి జిల్లావాసులకు ఆరెంజ్ అలెర్ట్

అక్షరదర్బార్, భూపాలపల్లి: జయశంకర్ భూపాలపల్లి , ములుగు జిల్లాల్లో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో, ఈ రెండు జిల్లాల వాసులు మండే ఎండలతో జాగ్రత్తగా ఉండాలని వాతావరణ కేంద్రం ప్రత్యేకంగా సూచించింది. రాబోయే నాలుగు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతాయని, తీవ్రమైన ఎండలతో పాటు వడగాల్పులు వీచే అవకాశమున్నదని హెచ్చరించింది. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఈ జిల్లాలకు 'ఆరెంజ్' హెచ్చరికలను జారీ చేశారు. ఆదివారం నాటికి ఆయా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఉత్తర భారతదేశం నుంచి వీస్తున్న పొడిగాలుల కారణంగానే ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. సాధారణంగా మార్చి మూడో వారం తర్వాత ఎండలు ముదురుతాయి, కానీ ఈసారి తొలి వారంలోనే వేడి తీవ్రత మొదలైంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రజలు అల్లాడిపోతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప బయటకు రాకపోవడమే మంచిదని అధికారులు స్పష్టం చేశారు.

### - హీట్ వేవ్ తో జాగ్రత్త

రానున్న మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2 నుంచి 3 డిగ్రీలు పెరగనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యారోగ్య శాఖ సూచించింది. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ (డీహెచ్) రవీందర్ నాయక్ ప్రత్యేక ప్రకటన విడుదల చేశారు. ఎండల బారి నుంచి రక్షించుకోవడానికి ప్రజలు ఈ క్రింది జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.


# ఏసీబీ వలలో తహసీల్దార్

- గజ్వేల్ తాహసీల్ లో  మెరుపు దాడులు
- లెక్కకు మించి ఆదాయం కలిగి ఉన్నాడనే ఆరోపణలు, కీలక పత్రాలు స్వాధీనం

అక్షరదర్బార్, సిద్దిపేట : ఏసీబీ అధికారులు శనివారం గజ్వేల్ తహశీల్దార్ శ్రావణ్ నివాసంలో సోదాలు చేపట్టారు. ముందుగా కరీంనగర్‌లోని ఆయన నివాసంలో మెరుపు దాడులు నిర్వహించాయి. ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న పక్కా సమాచారం అందడంతో ఏసీబీ బృందాలు ఏకకాలంలో తనిఖీలు ప్రారంభించాయి. తనిఖీల సమయంలో భారీగా నగదుతో పాటు కీలకమైన ఆస్తుల పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.  ప్రస్తుతం విచారణ ఇంకా కొనసాగుతోంది. అధికారులు స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, నగదు విలువపై పూర్తి స్థాయి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. విచారణ అనంతరం పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు.

# యూజీడీ పనులకు గ్రీన్ సిగ్నల్

- రూ.5,257 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ
- పరిపాలన అనుమతులు జారీ చేసిన సర్కార్
- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మాణం
- మారనున్న జీడబ్ల్యూఎంసీ ముఖచిత్రం



అక్షరదర్బార్, హనుమకొండ : తెలంగాణలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. చారిత్రక నగరాన్ని ఆధునిక హంగులతో తీర్చిదిద్దడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న ప్రభుత్వం, తాజాగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో చిరకాల సమస్యగా ఉన్న మురుగునీటి పారుదల వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు నడుం బిగించింది. నగరాభివృద్ధిలో అత్యంత కీలకమైన 'సమగ్ర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) మొదటి దశ పనుల కోసం ఏకంగా రూ. 5257.20 కోట్ల భారీ నిధులను మంజూరు చేస్తూ శనివారం పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఈ నిర్ణయంతో వరంగల్ ముఖచిత్రం మారడమే కాకుండా, నగరం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందడానికి పునాది పడినట్లయింది. గతంలో ఈ ప్రాజెక్టు కోసం రూ. 4170 కోట్ల వ్యయంతో ప్రాథమిక అనుమతులు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పెరిగిన అవసరాలు నుంచి తాజా అంచనాల వరకు లోతుగా పరిశీలించిన ప్రభుత్వం నిధులను భారీగా పెంచింది.

### - భవిష్యత్ అవసరాల దృష్ట్యా..

ఈ పథకాన్ని కేవలం ఒక మురుగునీటి పారుదల ప్రాజెక్టుగా మాత్రమే కాకుండా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టింది. ఈ నిధుల సేకరణ కోసం వినూత్న మార్గాలను అన్వేషించిన ప్రభుత్వం, కేంద్రం ప్రకటించిన 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్స (యూసీఎఫ్) నుంచి సహాయం పొందడానికి సిద్ధమైంది. దీనికి తోడు జర్మన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటి అంతర్జాతీయ సంస్థలు సైతం వరంగల్ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి ఆసక్తి చూపడం విశేషం. ఆ సంస్థ ప్రతినిధులు ఇప్పటికే నగరంలో పర్యటించి పనుల నాణ్యత నుంచి నిర్వహణ వరకు అన్ని అంశాల పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ తమ అంగీకారం తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల రూపకల్పనలో 50 శాతం వాటాను విదేశీ రుణ సహాయం నుంచి పొందనుండగా, 25 శాతం నిధులు కేంద్ర ప్రభుత్వ సహకారంతో 'అర్బన్ ఛాలెంజ్ ఫండ్' ద్వారా లభిస్తాయి. మిగిలిన 25 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వాటాగా కేటాయించింది. ఆర్థిక శాఖ నుంచి కూడా వీటికి అనుమతులు లభించడంతో, పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ పరిపాలన శాఖ సెక్రటరీ డాక్టర్ టి.కె. శ్రీదేవి ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే వరంగల్ నగరంలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడమే కాకుండా, ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడి నగరం మరింత సుందరంగా మారుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వరంగల్ ప్రగతి ప్రస్థానంలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915